క్లుప్తంగా

స్వీట్ల పంపిణీ



కార్యకర్తలకు స్వీట్లు అందజేస్తున్న బత్తిన

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు వార్డు అధ్యక్షుడు బత్తిన నాగరాజు దసరా పండగను పురస్కరించుకుని స్వీట్లు అందజేశారు. పార్టీ నాయకుడు సీతం రాజు సుధాకర్ సహకారంతో దసరా కానుకగా అందజేసినట్టు నాగరాజు తెలిపారు.

కమనీయం .. కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అలరించిన హరికథ



హరికథ చెబుతున్న యతిరాజ్ భాగవతార్ బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. బి.యతిరాజ్ భాగవతార్ బృందం ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. పట్టాభిరెడ్డి తోటలో సంపత్ వినాయగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అప్పన్న భక్తులకు కొర్రబియ్యం పాయసం



భోజనం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి



భక్తులకు పాయసం అందిస్తున్న సిబ్బంది

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదంతో పాటు కొర్ర బియ్యం పాయసం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి భక్తులతో పాటు కలిసి అన్నప్రసాదభవనంలో సహపంక్తి భోజనం చేశారు. ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



దుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



పట్టుచీరల అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



విశేష అలంకరణలో సాగరగిరి దుర్గమ్మ



దుర్గమ్మగా అనఘాలక్ష్మీదేవి



రామజోగిపేటలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న పీతల వాసు

క్షేమకారిణి.. అభయరూపిణి

- పలు రూపాల్లో దర్శనమిచ్చిన దుర్గాదేవి
- వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

శరన్నవ రాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన దుర్గామాత పూజల్లో భక్తులు పాల్గొని అమ్మవారికి విశేషంగా అర్చనలు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మ వారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, దీపారాధనలు చేశారు. దుర్గా మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

డాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు ఆర్‌బీటీ కుమార్‌శర్మ మహా చండీయాగం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆరిశెట్టి దినకర్, గ్రంధి రామకృష్ణారావు, పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, కంకటాల సతీష్, దుర్గా నూకేశ్వరరావు, దేవస్థానం మహిళా విభాగం సభ్యులు కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, పి. సుజాత, శైలజ పాల్గొన్నారు.

అంగటిదిబ్బలో..

జీవీఎంసీ 30వ వార్డు అంగటిదిబ్బలో దుర్గాదేవి ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. లక్కీ యూత్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



దుర్గాదేవిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న మన్యాల

ఎర్నిమాంబ ఆలయంలో..

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. మంగళవారం ఎర్నిమాంబ అమ్మవారిని పట్టుచీరలతో అలంకరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీయాగం చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా అన్నసమారాధన చేశారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాదరావు, రామకృష్ణారావు, జోజిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహా చండీయాగంలో పాల్గొన్న భక్తులు

విశేష అలంకరణల్లో దుర్గమ్మ..

అల్లిపురం : శరన్నవరాత్రులు చివరి రోజు దసరా సందర్భంగా దుర్గమ్మ విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సాగరగిరి కనకదుర్గమ్మ విశేష అలంకరణలో ఆకట్టుకున్నారు. అల్లిపురం వివేకానందకాలనీలో వెలసిన అనఘాలక్ష్మీదేవి దుర్గమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు.

బాబా పుణ్యతిథి నిర్వహణ..

విజయ దశమిని పురస్కరించుకుని అచ్చియ్యమ్మపేటలోని శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో సాయిబాబా పుణ్యతిథిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయిబాబాకు పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం చేశారు. 105 దీపాలు వెలిగించి సాయిబాబా కీర్తనలతో ఆకట్టుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. దీంతో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న నవరాత్రులు ముగిసాయని ఆలయ నిర్వాహకుడు ఉమ్మిడి నాగరాజు తెలిపారు. సాయంత్రం అమ్మవారి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు.



ఎర్నిమాంబ ఆలయంలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, ఈవో సురేష్‌బాబా

రామజోగిపేటలో..

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో గల్లీ క్రికెట్ బాయ్స్ ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏపీ స్టేట్ ఫారెస్ట్ డిపార్టుమెంట్ డైరెక్టర్ పీతల వాసు పాల్గొని దుర్గాదేవికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో గల్లీ క్రికెట్ బాయ్స్ పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



బోటు కోసం బారులు తీరిన భక్తులు



అమ్మవారి దేవాలయంలో భక్తుల కోలాహలం

భక్తజన సిరి.. సాగర గిరి

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం : భక్తజన సిరితో సాగరగిరి కళకళలాడింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావటంతో సాగరగిరికి భక్తులు పోటెత్తారు. బోట్లు కూడా నిండుగా భక్తులను పోర్టు వేంకటేశ్వరస్వామి టెంపుల్ వద్ద నుంచి ఆవలి ఒడ్డుకు చేర్చాయి. పోర్టు యాజమాన్యం, సీఐఎస్ఎఫ్ సిబ్బంది భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకుని తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. దేవాలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఉచిత ఆటోలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. సాగరగిరి దసరా ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు.



అచ్చియ్యమ్మపేటలోని సాయిబాబాకు 104 దివ్య జ్యోతులతో పుణ్యతిథి మహోత్సవం



దుర్గాలమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



కైలాష్‌కు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న నూకరాజుకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

పలువురికి రూ.40 వేల ఆర్థిక సాయం

డాబాగార్డెన్స్ : ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చిన వినతులపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించారు. సొంత నిధుల నుంచి పలువురికి రూ.40 వేల ఆర్థిక సాయం అందజేశారు. 32వ వార్డు అల్లిపురం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నీరజ్ తండ్రి అశోక్‌మిశ్రాకు ఇటీవల ఎమ్మెల్యే ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేయించారు. అతనికి మందుల కోసం రూ.10 వేలు అందజేశారు. బోధకాలితో బాధపడుతున్న 32వ వార్డు గోకుల్ థియేటర్ వెనుక నివసిస్తున్న కొండపల్లి వీర్రాజుకు రూ.5 వేలు అందజేశారు. నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న 37వ వార్డు పెయిందొరపేటలో నివసిస్తున్న కాసారపు నూకరాజు రూ.5 వేలు, కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అదే వార్డు రెల్లివీధికి చెందిన పితాని భవానీకి రూ.5 వేలు అందజేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న 35వ వార్డు కల్లుపాకలకు చెందిన కైలాష్ కొల్లువలసకు మందుల కొనుగోలుకు రూ.5 వేలు, డయాబెటిస్‌తో బాధపడుతున్న 31వ వార్డు కనకల వీధి వైఎస్సార్‌సీపీ గృహ సారథి తల్లి చిల్లా అప్పల నరసమ్మకు రూ.5 వేలు, దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టార్ గణేష్ యూత్‌కు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌తో ఆత్మరక్షణ

జగదాంబ : ఆత్మరక్షణకు బాక్సింగ్ క్రీడ ఎంతగానో దోహదపడుతుందని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌కి ఎంపికైన వార్డు క్రీడాకారులకు ఆయన సూర్యాబాగ్ పోలీస్ బ్యారెక్స్ మైదానంలో సోమవారం బాక్సింగ్ కిట్లు, టీ షీర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కి 35వ వార్డు నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపిక కావడం సంతోషకరం అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో క్రీడలకు ముందెన్నడూ లేనంతగా ప్రోత్సాహం అందజేస్తున్నారని గుర్తు చేశారు. బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించడం ద్వారా రాష్ట్రానికి, కోచ్‌కు, విశాఖకు పేరు తీసురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



బాక్సింగ్ క్రీడాకారులకు కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి శ్రీనివాస్, దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ బత్తి మంగరాజు, కంటిపిల్లి వరలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైసీపీ నాయకులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన

తాటిచెట్లపాలెం: దసరా మహోత్సవాలలో భాగంగా జీవీఎంసీ 42, 55 వార్డుల్లో శ్రీరామ బాలభక్త సమాజం (రామాలయం) అధ్యక్షుడు నూనెల పోలారావు ఆధ్వర్యంలో అన్నసమారాధనలు నిర్వహించారు. ముందుగా రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం సరిహద్దు 42వ వార్డు పరదేశమ్మ ఆలయంలో భారీ అన్నదానం నిర్వహించారు. అనంతరం 55వ వార్డు తాటిచెట్లపాలెంలోని రామాలయం వద్ద అన్నసమారాధన చేశారు. నూనెల పోలారావు, లావణ్య కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో ఈ అన్నదానాలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలారావు కుటుంబ సభ్యులు, ఆయా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తీరం.. సుందరం.. మరింత భద్రం

విశాఖ అంటే ముందుగా గుర్తుకొచ్చేది ఆర్కే బీచ్. నగరాన్ని, ఆర్కే బీచ్‌ను విడివిడిగా చూడలేం. రోజూ వేల మంది సందర్శకులు వస్తుంటారు. వీకెండ్స్‌లోనైతే.. తీరం జన సంద్రమేనంటే అతిశయోక్తి కాదు. పర్యాటకులు, సందర్శకులు మక్కువ చూపే ఆర్కే బీచ్‌ను మరింత సుందరంగా, భద్రంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ యంత్రాంగం నడుం బిగించింది.

- ఆర్కే బీచ్‌లో అభివృద్ధి, రక్షణ పనులు
- సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్

బీచ్‌రోడ్డు: విశాఖ తీరంలోని రామకృష్ణా(ఆర్కే)బీచ్ ఇప్పటికే పర్యాటకులకు స్వర్గధామం. తీరంలో నాటిన కొబ్బరి చెట్లు, వాటిని ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులతో రాత్రుళ్లు వాటి అందం మరింత ఇనుమడిస్తుంది. బీచ్ రోడ్డు డివైడర్లపై కూడా వివిధ రకాల మొక్కల్ని ఏర్పాటు చేసి, అందంగా తీర్చిదిద్దారు. ఇపుడు చేపట్టిన పనులతో సాగరతీరం మరింత ఆకర్షణీయంగా కనిపించనుంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు చేపట్టిన ఆ పనులన్నీ శరవేగంగా కొనసాగుతున్నాయి.

సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్

నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన స్మార్ట్ బస్టాప్‌లు సాగర తీరానికీ చేరాయి. సుమారు రూ.16 లక్షల వ్యయంతో ఆర్కే బీచ్ వద్ద జీవీఎంసీ చేపట్టిన స్మార్ట్ బస్టాప్ నిర్మాణం దాదాపు పూర్తయింది. త్వరలో జీవీఎంసీ అధికారులు దీనిని ప్రారంభించనున్నారు. రాత్రి పూట ఈ బస్టాప్ ప్రత్యేక ఆకర్షణగా మారనుందనడంలో సందేహం లేదు. వీటి డిజైన్, లైటింగ్ బస్టాప్ పరిసరాలను అందంగా మార్చుతున్నాయి. ప్రయాణికులు సేదతీరడంతోపాటు, వీటి ముందు సెల్ఫీలు తీసుకునేందుకూ ఇష్టపడుతున్నారు.



సిద్ధమవుతున్న స్మార్ట్ బస్టాప్

కెరటాల నుంచి రక్షణ

విశాఖ తీరంలో బీచ్‌రోడ్డుకు అతి సమీపంలో కెరటాల తాకిడి ఉండేది ఆర్కే బీచ్ మాత్రమే. భారీ కెరటాల కారణంగా రక్షణ గోడ కోతకు గురవుతోంది. దీని వల్ల భవిష్యత్తులో బీచ్ రోడ్డు కోతకు గురవకుండా జీవీఎంసీ యంత్రాంగం సిద్ధమయింది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. దీంతో పాటు సందర్శకులు తీరంలోకి వెళ్లి, ఇసుకతిన్నెలపై సేదదీరి, అలల అందాన్ని ఆస్వాదించేందుకు వీలుగా రక్షణ గోడ నుంచి మరిన్ని మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు.




శరవేగంగా సాగుతున్న రక్షణ గోడ పనులు

కొబ్బరి చెట్లకు రక్షణ

ఆర్కే బీచ్‌ను ఆనుకుని కొన్ని చోట్ల ప్రత్యేక ఏర్పాట్లతో నాటిన కొబ్బరి చెట్లకు కెరటాలు తాకిడి పెరుగుతోంది. దీంతో కోతకు గురై, నేలకు ఒరుగుతున్నాయి. వాటికి అలల ఒత్తిడి తగ్గించేలా అధికారులు రక్షణ చర్యలు ప్రారంభించారు. కొబ్బరి చెట్లు ఉండే ప్రాంతాలకు అడ్డంగా పెద్ద పెద్ద రాళ్లు వేశారు. దీంతో అలల తాకిడి తగ్గి, కొబ్బరి చెట్లు మరింత కాలం సందర్శకుల్ని ఆకట్టుకోనున్నాయి.

ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవాలు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సుధా సీతాపతిరావు సంకీర్తనలు ఆలపించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి.వి. రమాబాయి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



సంకీర్తనలు ఆలపిస్తున్న సుధా సీతాపతిరావు

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తనలు..

డాబాగార్డెన్స్ : ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనలు శ్రోతలు, భక్తులను ఆకట్టుకున్నాయి. మనోరంజని మ్యూజిక్ స్కూల్ ప్రతినిధి గుడిమెట్ల శారద, శిష్య బృందం ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మారోజు శ్రీనివాస్ కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.